క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని ఇసుకతోట ప్రాంతానికి చెందిన ఆకెళ్ల శ్రీనివాస జవహర్‌లాల్ నెహ్రూ రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు బాండ్‌ని అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

విశేషంగా సింహవల్లీ తాయారు తిరువీధి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారుకి శుక్రవారం సాయంత్రం విశేషంగా తిరువీధి నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్ఠింపజేసి, ఆలయ బేడామండపంలో తిరువీధి జరిపారు. విశేషంగా హారతులు అందించారు.

జాబ్ మేళాలో 56 మందికి ఉపాధి



జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల, ఎం.ఎస్.స్క్వేర్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 56 మందికి కొలువులు దక్కాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంఎస్ స్క్వేర్ టెక్నాలజీస్‌లో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 56 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వెల్లడించారు. వీరికి ప్రాథమిక జీతం రూ.25 వేలని తెలిపారు. జాబ్‌మేళాలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఈ ఫ్లోరా, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధులు పి.సాయిసంతోష్, పి.మణికంఠ, హెచ్.తరుణ్, జ్యోత్స్న, నవ్య, ఏవో రవిబాబు, ఏడీకే రాజు, కమలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: పెదముషిడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ మర్రిపాలెం, లంకెలపాలెం ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పెదముషిడివాడ, మార్కండేయ కాలనీ, కన్నూరు, మంత్రిపాలెం లంకెలపాలెం, ఈ మర్రిపాలెం, గొన్నవానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

గంటాను కలిసిన సింహాచలం దేవస్థానం ఈవో



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో సింహాచలం ఈవో, ప్రధానార్చకుడు

సింహాచలం: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుని శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 13 నుంచి 17 వరకు సింహగిరిపై జరిగే పవిత్రోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. వచ్చే నెల 1న జరిగే కృష్ణమయ్య జయంతి ఉత్సవానికి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా దేవస్థానం ఈవోతో పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రధానంగా పంచగ్రామాల భూ సమస్యపై ఇటీవల ప్రభుత్వం వేసిన కమిటీ, ప్రత్యామ్నాయ భూముల పరిశీలన తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈవో వెంట దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్ ఉన్నారు.

ముత్యాలమ్మపాలెం.. గంగ పుత్రుల వ్యథ!

- శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం, డ్రైఫిష్ ప్లాట్‌ఫాంలు
- మత్స్యకారుల వలలు, ఇంజిన్లు దాచుకునే వీల్లేని వైనం
- ఎండు చేపలు ఆరబెట్టేందుకూ తప్పని తిప్పలు

రాజుగారు–ఏడు చేపల కథ గురించి మనకందరికీ తెలుసు. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం మత్స్యకారులది ఎండు చేపల వ్యథ. వేట సామగ్రిని దాచుకునేందుకు కనీస వసతుల్లేవనే గంగ పుత్రుల బాధ. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో నిర్మించిన సామాజిక భవనమే ఇన్నేళ్లూ వారికి ఆశ్రయం ఇచ్చింది. సింహాద్రి ఎన్టీపీసీ నిర్మించిన ప్లాట్‌ఫారాలు చిరుచేపల్ని ఎండబెట్టుకునేందుకు ఉపయోగపడేవి. సరైన నిర్వహణ లేక ఇవన్నీ శిథిలమయ్యాయి. దీంతో మత్స్యకారులకు వెతలు మొదలయ్యాయి.



రోడ్డుపై ఎండబెట్టిన చిరు చేపలు



శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో మత్స్యకారుల కోసం 2004లో అప్పటి దివంగత మహానేత వైఎస్సార్ ప్రభుత్వం రూ.4 లక్షల వ్యయంతో సామాజిక భవనాన్ని నిర్మించింది. తీర ప్రాంతానికి అతి సమీపంలో చేపట్టిన ఈ భవనంలోనే ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం మత్స్యకారులు,, మత్స్యకార్మికులు చేపల వేటకు ఉపయోగించే వలలు, బోట్ల ఇంజిన్లు వంటి సామగ్రిని భద్రపరచుకునేవారు. ఆ తర్వాత నుంచి దీని ఆలనాపాలనా చూసేవాళ్లు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది.

శిథిల భవనంతో అవస్థలు

రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన సామాజిక భవనం నిర్వహణ బాధ్యతను అనంతర పాలకులు గాలికొదిలేశారు. ఐదు పదేళ్లకోసారైన దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆరంభంలో మెట్ల మార్గం ద్వారా భవనం పైకి వెళ్లి చిరు చేపల్ని ఎండబెట్టుకునేవారు. ప్రస్తుతం మెట్ల మార్గం కూడా ఓ భాగం కూలిపోయింది. భవనం ముందు భాగం పూర్తిగా బీటలు వారి శిథిలమైంది. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. గచ్చులు, శ్లాబ్ పెచ్చులుగా ఊడిపోయాయి. మరో దారిలేక ప్రస్తుతం ఆ శిథిల భవనంలోనే వలలు, ఇంజన్లను భద్రపరచుకుంటున్నారు.

ఎండు చేపలు రోడ్డు పాలు!

సముద్రంలో చిక్కిన చిరు చేపల్ని ఎండబెట్టుకోవడానికి వీలుగా సామాజిక భవనం సమీపంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో పదేళ్ల క్రితం మూడు ప్లాట్‌ఫాంలను నిర్మించింది. ఇవి కూడా నిర్లక్ష్యపు నీడలో శిథిలావస్థకు చేరాయి. చాలా చోట్ల బీటలువారాయి. ప్లాట్ ఫాంల ఫ్లోరింగ్ పాడవడంతో ఏ మాత్రం వర్షం వచ్చినా నీరు నిలిచిపోతోంది.



బీటలు వారిన డ్రైఫిష్ ప్లాట్ ఫాం

చేపల్ని ఎండబెట్టడానికి వీల్లేకుండా పోతోంది. దీంతో చేసేది లేక ఇసుక తిన్నెలపై వలలు పరిచి, చిరు చేపలను ఎండబెడుతున్నారు. కొంత మంది మత్స్యకారులు రోడ్లపైనే ఎండబెట్టుకుంటున్నారు. చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని గంగపుత్రులు వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాం. వేట సామగ్రిని భద్రపరచుకోవడానికి నిర్మించిన సామాజిక భవనం దాదాపు శిథిలావస్థకు చేరింది. సామగ్రిని భద్రపర్చుకోవడానికి ఇబ్బందులు తప్పట్లేదు. భవనం గచ్చులు పాడయ్యాయి. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. సామాజిక భవనం ఎదురుగా ఉన్న ప్లాట్ ఫామ్ బీటలు వారి గచ్చులు పూర్తిగా పాడయ్యాయి. తక్షణం మరమ్మతులు చేపట్టాలి.

– సూరాడ తాతాజీ, ముత్యాలమ్మపాలెం

ఎండు చేపలకు రోడ్డే ఆధారం



సముద్రంలో చిక్కిన చిరు చేపల్ని కొనుగోలు చేసి, ఎండబెట్టి గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తాను. స్థానికంగా లభ్యమైన పచ్చి చిరుచేపలను ఎండబెట్టేందుకు గ్రామంలో సరైన వసతి లేక రోడ్లపై వేయాల్సి వస్తోంది. తీరంలో ప్లాట్ ఫారాలు ఉన్నప్పటికీ బాగా పాడైపోయాయి. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు చేరి రోజుల తరబడి అలానే ఉంటున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– అరిజిల్లి బంగారమ్మ, చిరు చేపల వ్యాపారి

ప్రభుత్వానికి నివేదించాం



తీరంలో మత్స్యకారుల సౌకర్యార్థం నిర్మించిన సామాజిక భవనం, ప్లాట్ ఫారాల శిథిలావస్థకు చేరిన విషయం మా దృష్టికి కూడా వచ్చింది. మరమ్మతుల విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు కూడా తెలియజేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతాం. ప్రత్యామ్నాయాలపైనే ఆలోచిస్తున్నాం.

– హేమసుందరరావు, ఎంపీడీవో, పరవాడ

టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు వెంకటలక్ష్మి

సబ్బవరం: జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వెంకటలక్ష్మి విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. విశాఖ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లంకెలపాలెంలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెంకటలక్ష్మి విజేతగా నిలిచిందన్నారు. దీంతో ఈ నెల 14 నుంచి 16 వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలోని వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు, స్కూల్ కమిటీ చైర్మెన్ శంకరరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వెంకటలక్ష్మితో హెచ్‌ఎం తిరుపతిరావు, తదితరులు

21న సామూహిక సత్యనారాయణ వ్రతం

పరవాడ: వాడచీపురుపల్లి రామాలయంలో ఈ నెల 21న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారీస్ ప్రతినిధి ప్రభాకరమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 స్వామివారి వ్రతం ఉంటుందన్నారు. బెంగళూరుకు చెందిన రాజయోగి బి.కె.మంజునాథ్ నేతృత్వంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూజలో పాల్గొనే జంటలు పూజాసామగ్రి వెంట తీసుకురావాలన్నారు. పూర్తి సమాచారం కోసం 9502289597, 9908245869 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నేతలు

పరవాడ: కమ్యూనిస్ట్ యోధుడు సీతారాం ఏచూరి మృతి మార్క్సిస్ట్ పార్టీకి తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడ సంతబయలులో ఏర్పాటు చేసిన సంతాప సభలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన సీతారాం ఏచూరి చేసిన పోరాటాలను వివరించారు. సంతాప సభలో సీఐటీయూ నాయకులు ఎస్.సంతోష్, వి.రవి, ఎస్.కృష్ణ, అప్పారావు, సీహెచ్ గణేష్, కె.అప్పారావు, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకురాలు ప్రభావతి

సబ్బవరం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సీపీఎం నేత సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.ప్రభావతి తెలిపారు. సబ్బవరంలోని పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహానేతను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు యు.సత్యవతి, టి.కోటి, గౌరి, దేవుడమ్మ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

'యూ జీనియస్ 3.0' క్విజ్ పోటీల విజేత డీపాల్

సీతంపేట: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో 8 నుంచి 12 ఏళ్ల వయసు గల విద్యార్థులకు 'యూ జీనియస్ 3.0' నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటీషన్–2024 పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 116 పాఠశాలల నుంచి 435 బృందాలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానం, ప్రతిభా పాటవాలు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గుర్తించవచ్చన్నారు. ఈ పోటీల్లో డిపాల్ స్కూల్ విజేతగా, విశాఖ వ్యాలీ స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బహుమతులు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ రెండు జట్లు ముంబయిలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

సీఐ సతీష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



సతీష్‌కుమార్

పెందుర్తి: పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వి.సతీష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. సతీష్‌కుమార్ ఏసీబీలో విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



అవ్వాతాతలకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. అవ్వాతాతలకు విద్యార్థులు పాదపూజ చేసి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో అవ్వాతాతలతో ఆడీపాడీ సందడి చేశారు. పాఠశాల ప్రతినిధులు గ్రాండ్ పేరెంట్స్‌ని ఘనంగా సన్మానించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే పెద్దల పట్ల గౌరవం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రతినిధులు తెలిపారు. డీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

పినగాడి–గుళ్లేపల్లి రోడ్డుకు మరమ్మతులు

సొంత నిధులతో పనులు చేయించిన వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్



రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత గండి రవి

పెందుర్తి: ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా పాడైన పినగాడి–గుళ్లేపల్లి రోడ్డుకు శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. పినగాడి కూడలి సమీపంలోని ఈ రోడ్డు ప్రమాదకరంగా మారిన విషయాన్ని గమనించిన వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్ తన సొంత నిధులతో ట్రాక్టర్ల ద్వారా డెబ్రిస్‌ను తెప్పించి, యంత్రాల సాయంతో మరమ్మతులు చేయించారు. గోతుల్లోని నీటిని మోటార్లతో తోడించి, పిక్క, సిమెంట్ మిక్సర్‌తో పూర్తిగా పూడ్చారు. మొగలిపురం ఉపసర్పంచ్ సిరపరపు వాసు, వైఎస్సార్‌సీపీ సబ్బవరం మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, కర్రి ధనుంజయ్, గురి ఫణీంద్ర, సంపత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పద్య పఠన పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఆర్జేడీ విజయభాస్కరరావు

సబ్బవరం:ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి తెలుగు పద్య పఠన పోటీల్లో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి కె.పూర్ణబాబు ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం–2024ను పురస్కరించుకుని భీమిలి డైట్ కళాశాల ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ పరిధి 9వ తరగతి విద్యార్థులకు కళాశాలలో శుక్రవారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థికి కార్యక్రమ ముఖ్య అతిథి పాఠశాల విద్య ఆర్జేడీ విజయభాస్కర్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన పూర్ణబాబుతోపాటు గైడ్ టీచర్ రఘురామనాయుడుని ఆర్జేడీ, ప్రిన్సిపాల్, సహచర అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో తెలుగు టీచర్ ఐసాక్, వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, సిబ్బంది రాంబాబు, చిరంజీవిరావు, తిరుపతిరావు, జానకిరామ్, సాయిరాం, లక్ష్మణరావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

పొదుపు సంఘాలకు చెక్కుల అందజేత



పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ రుణాల చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సింహాచలం: 93వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. వార్డు పరిధి కృష్ణానగర్‌లో రూ.31.55 లక్షలతో నిర్మించే హోమియోపతి ఆస్పత్రి, కృష్ణానగర్‌లో వేదిక కల్యాణ మండపం వెనుక రూ.11.14 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లుకి శంకుస్థాపన చేశారు. సాయి మాధవ్‌నగర్ పార్క్‌ని సందర్శించారు. పార్క్‌ని ఆనుకుని స్థానికులు సొంత నిధులతో ఏర్పాటు చేసుకునే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. ప్రహ్లాదపురం కమ్యూనిటీహాల్లో పొదుపు సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హత కలిగిన 14 పొదుపు సంఘాలకి బ్యాంకులు మంజూరు చేసిన సున్నా వడ్డీ రుణాలు రూ.కోటి 4 లక్షల 40 వేల విలువైన చెక్కులను అందించారు. వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, వార్డు టీడీపీ అధ్యక్షుడు గంగ వరహాలు, 93వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు టి.ఆదిబాబు, 93వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కె.పురుషోత్తం పాల్గొన్నారు.

చవితి మండపాల్లో అన్నసమారాధనలు




అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి,శ్రీనివాసరావు

పరవాడ: స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద వీఎస్‌వీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ సిద్ధి వినాయకుడిని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకుని, పూజలు చేశారు. పరవాడ బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకుని, ఈ మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు పైల హరీష్, పోతల అప్పలనాయుడు, పైల అప్పలనాయుడు, సత్యవేణి, టీవీ అప్పారావు పాల్గొన్నారు.

రేపు సరిపల్లిలో మెగా వైద్య శిబిరం

పెందుర్తి:గీతం మెడికల్ కళాశాల/ఆస్పత్రి ఆధ్వర్యంలో పెందుర్తి మండలం సరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, కీళ్ల నొప్పులు(ఆర్థోపెడిక్), చర్మ రోగ విభాగం(డెర్మటాలజీ), ఈఎన్‌టీ, కంటి వైద్యం(ఆప్తామాలజీ), పిల్లల వైద్యం (పీడియాట్రిక్), స్త్రీల వైద్యం(గైనకాలజీ), డెంటల్ విభాగాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తామన్నారు. అవసరమైన వారికి గీతం మెడికల్ కళాశాలలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు జరగనున్న ఈ శిబిరాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు.

కాంచన మేఘం



ఆకాశం ఎందుకో పచ్చబడ్డదీ.. ఆ నడుమ బొట్టేమో ఎర్రబడ్డది.. అన్న పాట ఈ చిత్రం చూశాక కూనిరాగంలా బయటకు వస్తే మన తప్పేం లేదు. పాత అడవివరం నుంచి హనుమంతవాక వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలో శుక్రవారం సాయంత్రం ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఒక్కసారిగా ఆకాశంలో ఆకుపచ్చ మబ్బులు అలముకున్నాయి. వాటి మధ్యలో ఎరుపు, పసుపు కలిసిన బంగారు వర్ణంలో అరుణ కిరణాలు కాంతులీనాయి. ఆ వెలుగులు రోడ్డుపై పడి చూపరులకు మరింత అందంగా కనిపించాయి. – సింహాచలం